నమస్తే తెలంగాణ
# భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 28 మే 2024 | BHADRADRI KOTHAGUDEM


తిరుమలాయపాలెం పోలింగ్ కేంద్రం వద్ద సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ తాతా మధు


ఖమ్మం రోటరీనగర్ పోలింగ్ కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్


టేకులపల్లి పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ


కరకగూడెంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న మాజీ ఎమ్మెల్యే రేగా


కల్లూరులో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర


ఎర్రుపాలెంలో విజయచిహ్నం చూపుతున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు


చుంచుపల్లిలో ఓటు వేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


కొత్తగూడెంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న పట్టభద్రులు






అశ్వారావుపేటలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు


- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పటిష్ఠ భద్రత మధ్య ప్రశాంతంగా ఓటింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న 84,807 మంది గ్రాడ్యుయేట్లు
- ఖమ్మంలో 67.63, భద్రాద్రిలో 70.01 పోలింగ్ శాతం నమోదు
- మొత్తం 173 పోలింగ్ కేంద్రాల్లో పూర్తయిన పట్టభద్రుల పోలింగ్



# ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

ఖమ్మం, మే 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్గొండ జిల్లాల పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఉప ఎన్నికల పోలింగ్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఓటింగ్ సరళిని ఆయా కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూముల నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా కూడా పరిశీలించారు. ఈ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో అందుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా.. వారిలో ముగ్గురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఉన్నారు. వీరి మధ్యనే గట్టి పోటీ ఉంది. మిగతా 49 మంది వివిధ రిజిస్టర్ పార్టీల అభ్యర్థులతోపాటు ఏ పార్టీలతోనూ సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు కూడా ఉన్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 173 పోలింగ్ కేంద్రాలుండగా.. అందులో ఖమ్మం 118, భద్రాద్రి కొత్తగూడెంలో 55 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను నిర్వహించారు. సమస్యాత్మక కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల లోపలి భాగాల్లో వంద శాతం సీసీ కెమెరాలు అమర్చారు. వాటి ద్వారా ఓటింగ్‌ను విధానాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,23,985 మంది ఓటర్లుండగా.. వారిలో 84,807 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం జిల్లాలో 83,879 మంది ఓటర్లకు గాను.. 56,730 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 67.63 శాతం పోలింగ్ నమోదైంది. వీరిలో పురుషులు 34,847 మంది, మహిళలు 21,881 మంది, ట్రాన్స్‌జెండర్లు ఇద్దరు ఉన్నారు. భద్రాద్రి జిల్లాలో 40,106 మంది ఓటర్లకు.. 28,077 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70.01 శాతం పోలింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 16,206 మంది, మహిళలు 11,871 మంది ఉన్నారు.









## నిరంతర పర్యవేక్షణ మధ్య..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేసి శాంతిభద్రతలను నిరంతరం పర్యవేక్షించారు. ఖమ్మం సీపీ సునీల్‌దత్, భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా అల్లర్లు, ఘర్షణలు వంటివి జరుగకుండా పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను పటిష్ట బందోబస్తు మధ్య తరలించారు. ఖమ్మం జిల్లాలోని బాక్సులను ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిసెప్షన్ సెంటర్‌కు, భద్రాద్రి బాక్సులను కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొచ్చారు. అనంతరం వాటిని పట్టిష బందోబస్తు మధ్య నల్గొండలోని స్ట్రాంగ్ రూముకు తరలించారు. ఈ ఎన్నికల ఫలితాలను జూన్ 5న ప్రకటించనున్నారు.


ఓటు హక్కు వినియోగించుకున్న ఖమ్మం కలెక్టర్ దంపతులు


చంద్రుగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో బారులుతీరిన ఓటర్లు

# 'భద్రాద్రి'లో 70 శాతం

- జిల్లాలో ప్రశాంతంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న 28,077 మంది గ్రాడ్యుయేట్లు
- ప్రముఖుల్లో ఎమ్మెల్యే కూనంనేని, మాజీ ఎమ్మెల్యేలు రేగా, హరిప్రియ
- టేకులపల్లి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రియాంక
- పర్యవేక్షించిన ఎంపీ వద్దిరాజు, బీఆర్‌ఎస్ నేతలు రేగా, వనమా, తాటి
- కాంగ్రెస్ నేతల కక్కుర్తి.. కేంద్రాల్లోకి వచ్చి ఓట్ల కోసం నోట్ల ఎర..


టేకులపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల



భద్రాద్రి కొత్తగూడెం, మే 27 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఖమ్మం–వరంగల్–నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ భద్రాద్రి జిల్లాలో ప్రశాంతం ముగిసింది. జిల్లాలోని 55 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం 8 గంటలకే ప్రారంభమైన ఓటింగ్. పది గంటల వరకు మందకొడిగానే సాగింది. అప్పటికే కేవలం 7.74 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత ఒక్కరొక్కరుగా పట్టభద్రులు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడంతో పోలింగ్ శాతం పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు 10,342 మంది, 2 గంటలకు 18,688 మంది ఓట్లు వేశారు. సాయంత్రం 4 గంటలకు 27,294 మంది ఓట్లు వేశారు. అప్పటికి 68.05 శాతం ఓటింగ్ జరిగింది. మొత్తంగా సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి జిల్లాలో 40,106 మంది ఓటర్లకు గాను 28,077 మంది ఓట్లు వేశారు. మొత్తంగా 70.01 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## టేకులపల్లి పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ తనిఖీ..

జిల్లాలోని టేకులపల్లి పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ప్రియాంక తనిఖీ చేశారు. ఓటింగ్ తీరును పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా అన్ని కేంద్రాల పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. ఎస్పీ రోహిత్‌రాజు కూడా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.

## ఓట్ల కోసం నోట్ల ఎర..

పోలింగ్ సమయంలోనూ కాంగ్రెస్ నాయకులు తమ కక్కుర్తిని ప్రదర్శించారు. గ్రాడ్యుయేట్ల ఓట్ల కోసం నోట్లను ఎరగా చూపారు.

ఏకంగా పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చి పట్టభద్రులకు నోట్లు చూపించి మరీ ఓట్లు వేయించుకున్నారు. చివరికి అక్కడికి మీడియా ప్రతినిధులు చేరుకునే సరికి ఉడాయించారు. ఈ తతంగాన్ని ఎన్నికల అధికారులు కూడా పట్టించుకోలేదు. తమకు సమాచారమేమీ లేదంటూ తప్పించుకున్నారు.

## ఓటేసిన ప్రముఖులు..

జిల్లాలోని పలువురు ప్రముఖులు తమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరకగూడెంలో పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, టేకులపల్లిలో ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, చుంచుపల్లిలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు ఓటు వేశారు. అధికారులు, ఉద్యోగులు ఎక్కువగా కొత్తగూడెం బాబూక్యాంపులో వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## పోలింగ్ సరళిని పర్యవేక్షించిన బీఆర్‌ఎస్ నేతలు

భద్రాది జిల్లాలో పోలింగ్ సరళిని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు పరిశీలించారు. కొత్తగూడెం, టేకులపల్లి కేంద్రాల్లో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు పోలింగ్ కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, బానోతు హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు తదితరులు ఓటింగ్‌ను పరిశీలించిన పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. కాగా, ఓటు హక్కు వినియోగించుకున్న పట్టభద్రులకు కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా కృతజ్ఞతలు తెలిపారు.


కొత్తగూడెంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

# నల్గొండకు బ్యాలెట్ బాక్స్‌లు : కలెక్టర్


రిసెప్షన్ సెంటర్‌లో బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, మే 27 : పట్టభద్రుల ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్‌లకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో సీల్ వేసి.. పోలీస్ భద్రత నడుమ నల్లగొండలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంకు తరలించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత పోలింగ్ కేంద్రాల నుంచి సీల్ వేసిన బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల ఫారాలు పోలీస్ ఎస్కార్ట్, సెక్టార్ అధికారుల పర్యవేక్షణతో ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి చేరాయన్నారు. ఇక్కడి అధికారులు, సిబ్బంది వాటిని సరిచూసుకొని మళ్లీ పోలీస్ ఎస్కార్ట్ భద్రత నడుమ ఆర్టీసీ డీజీటీ బస్సులలో నల్గొండలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంకు తరలించామని చెప్పారు. జూన్ 5న నల్గొండలో కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేశ్, రాజేందర్, డీఎం సివిల్ సప్లయిస్ శ్రీలత, అధికారులు పాల్గొన్నారు.


స్ట్రాంగ్ రూంకు తరలించేందుకు బ్యాలెట్ బాక్స్‌లను తీసుకెళ్తున్న హమాలీలు

# లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు సంసిద్ధంగా ఉండాలి

## వీసీలో ఈసీఐ రాజీవ్‌కుమార్

మామిళ్లగూడెం, మే 27 : లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసి సంసిద్ధంగా ఉండాలని భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ సూచించారు. సోమవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల కమిషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్.. ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్‌భీర్‌సింగ్ సందులతో కలిసి కౌంటింగ్ నిర్వహణ, సన్నద్ధతపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనగా.. ఖమ్మం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని, దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత కల్పించాలని, ఫలితాలు వెలువరించేందుకు మీడియాకు ప్రత్యేక పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ప్రత్యేక కౌంటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, స్ట్రాంగ్‌రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌కు ఈవీఎంల తరలింపునకు అవసరమైన మేర సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేయాలని, వీవీ ప్యాట్ లెక్కింపునకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరగాలన్నారు. వీసీలో అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఆర్వో ఎం.రాజేశ్వరి, జడ్పీ సీఈవో వినోద్, డీఆర్డీవో సన్యాసయ్య, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీలత, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్